క్లుప్తంగా

నేడు వంగవీటి విగ్రహావిష్కరణ

కొయ్యలగూడెం: మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ వంగవీటి మోహనరంగా విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అధ్యక్షత వహించనున్నారని, వంగవీటి రంగా అభిమానులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులతోపాటు వివిధ సామాజిక వర్గాల నాయకులను ఆహ్వానించామని పేర్కొన్నారు. వంగవీటి రంగా అన్ని సామాజిక వర్గాలకు చెందిన నాయకుడని తెలిపేలా దళిత మహిళా సర్పంచ్‌తో విగ్రహ ఆవిష్కరణ నిర్వహిస్తున్నట్లు విగ్రహ ఏర్పాటు నిర్వాహకులు పేర్కొన్నారు.

ఓటు హక్కు ప్రాధాన్యతను గుర్తించాలి



చింతలపూడిలో ఓటు హక్కు నమోదుపై నిర్వహిస్తున్న అవగాహనా ర్యాలీ

చింతలపూడి: ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కృష్ణజ్యోతి పిలుపునిచ్చారు. గురువారం చింతలపూడి పట్టణంలో ఓటర్ల నమోదుపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఫైర్ స్టేషన్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి ఓటర్ల నమోదుపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కృష్ణజ్యోతి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటర్లుగా నమోదు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఓటుకున్న ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు. ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ముందుగానే ఓటు ఉన్నవారు జాబితాలో పేరు ఉందో లేదో చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మురళీకృష్ణ, బూత్ లెవెల్ అధికారులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



చొతనా సెంటర్‌లో వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై జయబాబు

కామవరపుకోట: మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని తడికలపూడి ఎస్సై జయబాబు తెలిపారు. గురువారం స్థానిక చొతనా సెంటర్లో వాహనలను తనిఖీ చేసి, ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. వాహనాలకు సరైన రికార్డులులేని, అధికలోడు, మద్యం సేవించి వాహనం నడిపిన 15 మందిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. వాహనదారులు విధిగా రోడ్డు నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనం నడిపితే ప్రమాదాల బారిన పడతారని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు.

నేడు సత్యదేవుని వ్రతాలు

జంగారెడ్డిగూడెం: గోకులతిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో కార్తీక బహుళ ఏకాదశి సందర్భంగా శుక్రవారం ఉదయం 10 గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. కార్యక్రమములో పాల్గొనాలనుకునే వారు రూ.200 చెల్లించి పాల్గొనవచ్చునన్నారు. పూజా ద్రవ్యాలు ఆలయ అధికారుల వారిచే ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమం అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహిస్తామన్నారు.

త్రీ టౌన్ ఎస్సైగా మదీనా బాషా

ఏలూరు టౌన్: ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సైగా మదీనా బాషా నియమితులయ్యారు. ఎస్పీ డి.మేరిప్రశాంతి ఆదేశాల మేరకు ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించారు. త్రీటౌన్ సీఐ కోమాకుల శివాజీని మర్యాదపూర్వకంగా కలిశారు. మదీనాబాషా ఏలూరు వన్‌టౌన్ స్టేషన్‌లో పనిచేశారు. ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి మరోసారి త్రీటౌన్‌కు ఎస్సైగా వచ్చారు.

రైతులకు అండగా నిలుస్తాం

- పోలవరం నియోజకవర్గంలో 20,280 ఎకరాల్లో పంటల నష్టం
- దెబ్బతిన్న పంటలను పరిశీలించిన పోలవరం ఎమ్మెల్యే బాలరాజు



బుట్టాయగూడెం: ఎస్ఆర్‌పాలెంలో దెబ్బతిన్న పొగాకు పంటలను పరిశీలిస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



లింగపాలెం: ధర్మాజీగూడెంలో తుపానుకు దెబ్బతిన్న మిర్చి పంటను పరిశీలిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా, వైఎస్సార్ సీపీ నేతలు

బుట్టాయగూడెం: తుపాను ప్రభావంతో పంటలు దెబ్బతిన్న రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తామని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. బుట్టాయగూడెం మండలం నూతిరామన్నపాలెం, నందాపురం సమీపంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పొగాకు, మొక్కజొన్న పంటలను బాలరాజు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పొగాకు రైతు సయ్యద్ బాజీ మాట్లాడుతూ తాను 70 ఎకరాల వరకూ పొగాకు పంట వేశానని చెప్పారు. 2 నెలల కాలంలో పంటలకు, ఎరువులకు కూడా అధిక మొత్తంలో డబ్బు ఖర్చు పెట్టానని, అయితే ప్రస్తుతం కురిసిన వర్షాలకు పంట మొత్తం పాడైపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి సమగ్ర సర్వేతో పంటల నష్టాలను అంచనా వేసి జిల్లా కలెక్టర్‌కు నివేదికలు పంపాలన్నారు. అనంతరం బాలరాజు విలేకర్లతో మాట్లాడుతూ మిచాంగ్ తుపాను కారణంగా పోలవరం నియోజకవర్గంలో 20,280 ఎకరాల్లో వరి, వేరుశనగ, మిర్చి, పొగాకు, ప్రత్తి, వైట్ బార్లి, నాటు పొగాకు పంటలు నష్ట పోయినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేయడం జరిగిందని చెప్పారు. నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. బుట్టాయగూడెం మండలంలో జరిగిన పంట నష్టం వివరాలను ఏఓ సుమలతను అడిగి తెలుసుకున్నారు. బుట్టాయగూడెం మండలంలో 1956.6 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.శారాశాంతి, జెడ్పీటీసీ మొడియం రామతులసి, సొసైటీ అధ్యక్షుడు ఆరేటి సత్యనారాయణ, సర్పంచ్ కుంజా వెంకటేశ్వరరావు, నాయకులు ఎస్ఎస్‌వీ వెంకట్రావు, సోదెం సుధాకర్, శ్రీను, వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే ఎలీజా

లింగపాలెం: తుపాను ప్రభావంతో భారీ వర్షాలు, ఈదురుగాలులకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. గురువారం మండలంలోని యడవల్లి, లింగపాలెం, మఠంగూడెం, ధర్మాజీగూడెం, భోగోలు, రంగాపురం, వేములపల్లి, కె గోకవరం తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే ఎలీజా, అధికారులు, వైఎస్సార్ సీపీ నేతలు పర్యటించారు. దెబ్బతిన్న వరి, పొగాకు, మిర్చి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలను పరిశీలించారు. పంట నష్టాలు, పెట్టిన పెట్టుబడుల వివరాలను ఎమ్మెల్యే ఎలీజా రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎలీజా మాట్లాడుతూ రైతులు అధైర్యపడాల్సిన పనిలేదని, అందరిని ఆదుకొనేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. నష్టపోయిన ప్రతి ఒక్క రైతు వివరాలను తక్షణం నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. తడిసిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ మురళీకృష్ణ, ఏవో కె మురళీకృష్ణ, మాజీ ఏఎంసీ ఛైర్మన్ మండలపు సాయిబాబు, మండల వైఎస్సార్ సీపీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, సర్పంచ్‌లు కె రమేష్, డి రవీంద్ర, సొసైటీ ఛైర్మన్లు ఉప్పలపాటి వరప్రసాద్, బి.సోమిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు రావి కొండయ్య, మండలపు నరసింహారావు, కె ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో వంతెనకు గండి



శివపురం గ్రామం వద్ద తమ్మిలేరుపై వంతెనకు గండిపడిన దృశ్యం

చింతలపూడి: భారీ వర్షాలకు ఆంధ్రా కాల్వ నుంచి తమ్మిలేరు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరింది. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు శివపురం గ్రామం వద్ద కృష్ణా, ఏలూరు సరిహద్దులో శివపురం–చిన్నంపేట గ్రామాల మధ్య నిర్మించిన వంతెనకు ఒక పక్క గండి పడింది. దీంతో రెండు జిల్లాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. 2012లో కూడా నీలం తుపానుకు వచ్చిన వరదలకు ఇదే ప్రాంతంలో గండి పడటంతో అప్పట్లో ఇసుక బస్తాలు వేసి పూడ్చారు. గండిని పూడ్చి రాకపోకలను పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. తమ్మిలేరు ప్రాజెక్టులో ప్రస్తుతం 344.73 అడుగుల నీరు నిల్వ ఉన్నట్లు తమ్మిలేరు ఇరిగేషన్ ఏఈ యు పరమానందం తెలిపారు. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 355 అడుగులు కాగా జలాశయంలో 350 అడుగుల వరకు నీటిని నిల్వ చేసుకోవచ్చునని అధికారులు చెప్పారు.

పంటలను పరిశీలించిన నేతలు



జంగారెడ్డిగూడెం రూరల్: లక్కవరంలో పంటలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకుంటున్న చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా



టి.నరసాపురం: దెబ్బతిన్న పంటలను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సూరిబాబు

జంగారెడ్డిగూడెం రూరల్: రైతులకు అన్ని విధాలా ప్రభుత్వం అండగా ఉంటుందని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. లక్కవరంలో తడిసిన పంటలను గురువారం ఆయన పరిశీలించారు. ముంపునకు గురైన పంటల వివరాలను అధికారులు ఎమ్మెల్యేకి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ రైతు సంక్షేమమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రైతుకు ఏ కష్టం, ఏ నష్టం రాకుండా అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గెల్లా వెంకటరమణ, ఎంపీపీ కొదమ జ్యోతి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గురునాధరెడ్డి, నాయకులు గురజాల పార్థసారథి, బడి పాపారావు, గంజి వినోద్, చిట్టిబొమ్మ శివ, తహసీల్దార్ స్లీవజోజి, ఎంపీడీవో కె.విజయ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

జలాశయంలోకి తగ్గిన వరద ఉధృతి

కొంగువారిగూడెం కేకేఎం ఎర్రకాలువ జలాశయంలోకి గురువారం ఉదయం గంటకు 18,412 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా గేట్ల ద్వారా గంటకు 11,200 క్యూసెక్కుల నీటిని విడిచి పెట్టారు. సాయంత్రం 6 గంటల సమయానికి ఇన్‌ఫ్లో తగ్గుతూ వచ్చింది. గంటకు 2500 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, 2400 క్యూసెక్కుల నీటిని గేట్ల ద్వారా దిగువకు విడిచిపెట్టినట్లు ఇరిగేషన్ ఏఈ భాస్కరరావు తెలిపారు.

టి.నరసాపురం: తడిసిన, రంగుమారిన, మొలకెత్తిన ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేసి ప్రతి ఒక్క రైతుకి అండగా ఉండేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారని, రైతులు అధైర్య పడవద్దని జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు (సూరిబాబు) అన్నారు. మండలంలోని మిచాంగ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో గురువారం ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. కల్లాల్లో తడిసిన ధాన్యాన్ని, నేలకొరిగిన పంటలను పరిశీలించారు. అదేవిధంగా మిరప, వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటలను పరిశీలించి అధికారులను పంట నష్టం అంచనాలు త్వరితగతిన సిద్ధం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సూరిబాబుతో పాటు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీను రాజు, పార్టీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వాసిరెడ్డి మధు, తహసీల్దార్ జీవీ సుబ్బారావు, మండల వ్యవసాయ అధికారి డీవీ ముత్యాలరావు, పార్టీ నాయకులు దాకారపు సూరిబాబు, తోట లక్ష్మీనారాయణ, రామారావు, రైతులు పాల్గొన్నారు. మండలంలో తుపాను కారణంగా వరి 1307 ఎకరాల్లో, మొక్కజొన్న 517 ఎకరాల్లో, వేరుశనగ 112 ఎకరాల్లో, పొగాకు 585 ఎకరాల్లో, పత్తి 10 ఎకరాల్లో నష్టం సంభవించినట్లు ప్రాథమిక అంచనా వేయడం జరిగిందని ఏవో డి.ముత్యాలరావు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కామవరపుకోట: ఆర్‌డీఎస్ఎస్ విద్యుత్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.రాధాకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తడికలపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న సాగిపాడు, వీరంపాలెం, ఆశ్రమం, ఇండస్ట్రియల్, తడికలపూడి అగ్రికల్చరల్, కళ్ళచెరువు, శివాలయం ఫీడర్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నందున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



సి.మధుబాబు, జూనియర్ సివిల్ జడ్జి

చింతలపూడి: జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కోర్టు వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్‌అదాలత్‌లను వినియోగించుకోవాలని సూచించారు. ఈ నెల 9న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో క్రిమినల్, సివిల్, బ్యాంక్ రికవరీ, చెక్ బౌన్స్ కేసులు, బీఎస్ఎన్ఎల్ రికవరీ కేసులు, కుటుంబ తగాదా, మనోవర్తి, ప్రామిసరీ నోట్, మున్సిపాలిటీ పన్ను బకాయి కేసులు పరిష్కారం చేసుకోవచ్చునని తెలిపారు. కోర్టుల్లో కేసుల సంఖ్య తగ్గించడానికి పోలీసులు, న్యాయవాదులు లోక్ అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కేసులు రాజీ చేసుకునే వారి కోసం ప్రతి రోజూ కోర్టులో ప్రీలోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సివిల్ కేసుల్లో కోర్టుకు కట్టిన ఫీజును కూడా తిరిగి తీసుకోవచ్చునన్నారు. సమాచారం కోసం దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లను, కోర్టు సిబ్బందిని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

క్రికెట్ కిట్ల పంపిణీ



పంచాయతీ కార్యదర్శులకు కిట్‌లను అందజేస్తున్న ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి

పోలవరం రూరల్: యువత విద్యతో పాటు ఆటల్లో కూడా ప్రతిభ సాధించాలనే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి అన్నారు. పోలవరం మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న నూతనంగా ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్రా కిట్లను గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. మండలంలోని 15 పంచాయతీలకు ఈ కిట్‌లను అందజేశారు. మండల పరిషత్ కార్యాలయ ఏవో సీహెచ్ శ్రీనివాసబాబు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం



వెంకటాపురం సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం

లింగపాలెం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందని లింగపాలెం మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు అన్నారు. అయ్యపరాజుగూడెం గ్రామంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు ఇంటింటికీ వెళ్లి పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అవినీతికి తావులేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత జగనన్నదేనని నాయకులు అన్నారు. అనంతరం సంక్షేమ పథకాల వివరాలను తెలియజేసే బోర్డును, పార్టీ జెండాను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్ ఆశీర్వాదం, వైఎస్సార్ సీపీ నాయకులు చీదరాల ప్రసాద్, బి.ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి: రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని గురువారం మండలంలోని వెంకటాపురం సచివాలయం వద్ద నిర్వహించారు. సర్పంచ్ చేపూరి సాయికుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాలుగున్నర ఏళ్ళలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గురించి ప్రజలకు వివరించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూరుశాతం అమలు చేశారని తెలిపారు. రాష్ట్రానికి మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. సభలో సంక్షేమ పథకాల బోర్డును ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ సాయికుమారి, ఎంపీటీసీ వి.నాగేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

వర్జీనియా తోటల్లో ఇసుక మేటలు



కొయ్యలగూడెం: మంగపతిదేవిపాలెం వద్ద వర్జీనియా తోటలలో వేసిన ఇసుక మేటలు



బుట్టాయగూడెం: కామయ్యపాలెంలో ఇసుక మేటలు వేసిన వేరుశనగ పంటను పరిశీలిస్తున్న తహసీల్దార్

కొయ్యలగూడెం: మిచాంగ్ తుపాను ప్రభావం రైతులపై తీవ్ర ప్రభావం చూపించింది. ముఖ్యంగా వర్జీనియా పొగాకు తోటలకు భారీ నష్టాన్ని మిగిల్చింది. పొగాకు తోటలలో వరద ప్రవహించడం వల్ల ఇసుక మేటలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఎకరాకు రూ.75 వేల నుంచి లక్ష పెట్టుబడి పెట్టామని, వర్షంతో వచ్చిన వరదల వల్ల చేలలోని ఇసుక మేటలను తొలగించడానికి ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు అవుతుందని రైతు ఊసా దామోదరం వాపోయాడు. మళ్లీ తోటలు వేసినా అదును ప్రభావం దాటిపోతుందని, దీంతో నాణ్యమైన పొగాకు దిగుబడి సాధ్యం కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజవరం పంచాయతీ పరిధిలో అదేవిధంగా కన్నాపురం, దిప్పకాయలపాడు పంచాయతీల్లోని పొగాకు తోటలలో ఇసుక మేటలను వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు పరిశీలించారు. నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని వారు తెలిపారు.

దిక్కుతోచని స్థితిలో రైతులు

బుట్టాయగూడెం: తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఏజెన్సీ మెట్టప్రాంతాల్లోని వర్జీనియా పొగాకు, వేరుశనగ రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కుండపోతగా కురిసిన వర్షానికి పొగాకు, మినుము, వేరుశనగ పంటల్లోకి వరదనీరు భారీగా వచ్చి చేరింది. దీనికి తోడు ఈదురుగాలులు కూడా భారీగా వీయడంతో పలుచోట్ల పొగాకు, వేరుశనగ పంటలపై వరదనీరు ముంచెత్తడంతో ఇసుక మేట్లు వేశాయి. రైతులు ఇసుక మేట్లతో ఉన్న పంటలను చూసి తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కాగా ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో సుమారు 1137 ఎకరాల్లో మొక్కజొన్న, 2064 ఎకరాల్లో పొగాకు, 1515 ఎకరాల్లో ప్రత్తి, 76 ఎకరాల్లో మినుము, 413 ఎకరాల్లో వేరుశనగ పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేశామని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా దెబ్బతిన్న పంటలను పరిశీలించిన అధికారులు నివేదికలను తయారు చేసి ఉన్నతాధికారులు పంపిస్తామని చెబుతున్నారు.

తడిసిన ధాన్యం తరలించడానికి చర్యలు



తహసీల్దార్ కార్యాలయంలో దెబ్బతిన్న పంటల వివరాలను సమీక్షిస్తున్న మండల ప్రత్యేక అధికారి శ్యాంసుందర్

చింతలపూడి: తుపానుకు తడిసిన ధాన్యం తరలించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు మండల ప్రత్యేక అధికారి, జిల్లా విద్యాశాఖాధికారి శ్యాంసుందర్ తెలిపారు. ఇటీవల తుపాను ప్రభావంతో భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు, తడిసిన ధాన్యం వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గురువారం చింతలపూడిలో ఆయన మాట్లాడుతూ వర్షాలకు 852 మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసినట్లు తెలిపారు. తుపానుకు ముందు కోసి ఆరబెట్టుకున్న ధాన్యం 5,228 మెట్రిక్ టన్నులు తరలించాల్సి ఉందన్నారు. గురువారం ధాన్యం తరలింపునకు 7 లారీలు మండలానికి వచ్చినట్లు చెప్పారు. 290 మెట్రిక్ టన్నుల ధాన్యం తరలించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. అదేవిధంగా మండలంలో వర్షాలకు రెండు గృహాలు దెబ్బతిన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణజ్యోతి ఉన్నారు.

'గడపగడపకు' అర్జీలకు తక్షణ పరిష్కారం

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ప్రాధాన్యతా క్రమంలో సత్వరమే పరిష్కరిస్తున్నట్టు ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. గురువారం ఏలూరు శ్రీరామ్ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గడపగడపకు అర్జీలపై ఆయన అధికారులతో సమీక్షించారు. వన్‌టౌన్ 7వ డివిజన్ 55వ సచివాలయం పరిధిలో ఇటీవల నిర్వహించిన గడపగడపకు కార్యక్రమంలో ప్రజలు పలు సమస్యలపై అర్జీల వచ్చినట్టు చెప్పారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నగరంలో స్థానిక సమస్య పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళుతున్నట్టు చెప్పారు. సమీక్షలో రాష్ట్ర సాహిత్య అకాడమి ఛైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి, డిప్యూటీ మేయర్ ఎన్ సుధీర్‌బాబు తదితరులు ఉన్నారు.